# సంపన్నుడు

ఒంగోలు నుండి గుంటూరు వెళ్ళాలి అంటే బస్సు ప్రయాణమంత హాయి మరొకటి లేదు. అప్పైన మేదరమెట్లలో ఆగినప్పుడు ఓ పావుకిలో పప్పుచెక్క కొనుక్కొని తింటూ కూర్చుంటే ఇక ఆ ఆనందం చెప్పనలవేఁగాదు.

శ్రీరామచంద్రమూర్తి వచ్చి గుంటూరు వెళ్దామన్నప్పుడు– సత్యం కాస్తంత నసిగినమాట వాస్తవమేగాని– తరువాత అతడు చెప్పిన కారణం విన్నప్పుడు రాను అనలేకపోయాడు.

అప్పటికీ, "నేను రావటం వలన వెళ్ళిన పని చెడిపోదుగదా!" అన్నాడు.

శ్రీరామచంద్రమూర్తి కాస్త సీరియస్‌గా చూచి, "ఆ కారణంతో వాళ్ళు మా అమ్మాయిని చేసుకోవటానికి అయిష్టాన్ని చూపిస్తే వాళ్ళతో సంబంధమే నాకు వద్దు!" అన్నాడు.

వాళ్ళ పరిచయం నాలుగేళ్ళది. అంటే ఒంగోల్లో సత్యమూ అదే ఆఫీసులో జేరిననాటినుండి. ఎందుకో ఒక్కొక్కరిని చూస్తుంటే అనుకోకుండానే ఆత్మీయత ఏర్పడుతుంది. అతిత్వరలోనే అది విడదీయరాని బంధమూ అవుతుంది.

కారణం ఏమిటి అంటే– సమాధానం వుండదు– అంతే.

ఉదయాన ఆరుగంటలకు బస్సు ఎక్కారు ఇద్దరు. తొమ్మిదింటిలోపు గుంటూరు వెళితే సాయంత్రం లోగా పని పూర్తి చేసుకొని తిరిగి రాత్రి ఏడు గంటలకు ఒంగోలు వచ్చేయవచ్చు. ఆ రోజు ఆదివారం అవ్వటంతో శెలవు ఖర్చు కూడా లేదు.

శ్రీరామచంద్రమూర్తికి ఒక్కగానొక్క కూతురు. చదువున్నది. అందమున్నది. కాస్తో కూస్తో కట్నం కూడా ఇవ్వ గలరు. ఆ అమ్మాయికి ఇప్పుడు ఇరవైరెండు నడుస్తున్నది.

యింజనీర్ల వేటలో వున్నాడు. గుంటూరులో ఓ సంబంధం– కుర్రవాడు మంచివాడు– బందరు ఇంజనీరింగ్ కాలేజీలో చదివి బయటకు వచ్చాడు అని తెలిసినప్పుడు– అతడికి ఆలస్యం చేయటం ఏమాత్రం ఇష్టం లేకపోయింది. దాని ఫలితమే ఈ ప్రయాణం!

మేదరమెట్ల వచ్చింది బస్సు మద్దిపాడు దాటి. పప్పుచెక్క కొనుక్కుంటే బాగుంటుందని సత్యం మనస్సు తహతహలాడుతున్నా బస్సు ఆగితేకదా కొనగలిగేది.

"అతగాడి కోరికలేమిటిట?" సత్యం అడిగాడు.

"చదువు కావాలిట... అందం ఉండాలిట... ఉద్యోగమక్ఖర్లేదట!"

"ఇంకేం... ఇందూకు అవన్నీ వున్నాయిగదా!"

"మర్చిపోయాను- అన్నిటికంటే ముఖ్యం... జాతకాలు కలవాలిట!"

సత్యం నవ్వాడు. "నాన్సెన్స్... వాళ్ళకు ఏది నచ్చకపోయినా సున్నితంగా తిరస్కరించటానికి జాతకం ఉపయోగ పడుతుందే తప్ప.... అవి ఇంకెందుకూ పనికిరావు!"

"నువ్వు అదే మాట అంటావని నాకు తెలుసులే!" అతడు చిన్నగా నవ్వాడు.

"అంటే?"

"అదేనోయ్... నేను జాతకాలు చూసి చేసుకున్నానా... అయినా సుఖంగా లేనా అంటావ్!" అతడన్న దాంట్లో చాలా వరకూ నిజమున్నదిగాని... సత్యం ఎక్కడ బాధపడతాడో అన్నట్లుగా అసలు విషయం పూర్తిగా అనలేదు.

సత్యం నవ్వాడు. "అదిగాదు మూర్తీ! ఒకసారి మా చెల్లెలు విషయంలో ఒకళ్ళింటికి వెళ్ళాను... జాతకాలు కావాలేమో- మానాన్నగారు అడగమన్నారూ అంటే- ఆ పిల్లవాడి తండ్రి ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడేం?"

"పిల్లకు పిల్లవాడు... పిల్లవాడికి పిల్ల నచ్చితే వాళ్ళ జాతకాలు కలిసినట్లే! అని నవ్వేస్తూ... అసలు జాతకాలు కుదరకపోతే ఒకళ్ళకు ఒకళ్ళు నచ్చరండీ- అన్నాడు. ఆయన మాటల్లో నాకు ఎంతో నిజమున్నదనిపించింది!"

బస్సు అద్దాలు మూసినా చల్లటిగాలి వీస్తున్నది లోపలకు. బద్ధకంగా అప్పుడే నిద్రలేస్తున్నట్లున్న ఊళ్ళను దాటుకుంటూ బస్సు ముందుకు దూసుకుపోతోంది.

రోడ్డు పక్కగా ఏపుగా పెరిగిన చింతచెట్లు రోడ్డు మీద రాత్రి కురిసిన చల్లదనానికి ఆచ్ఛాదనలా వున్నాయి... రోడ్డు పక్కగా పొలాలు... మధ్యలో మామిడితోటలు... ఒక్కొక్కచోట వరసగా పెరిగిన కొబ్బరిచెట్లు గట్లవారగా పొలాలకు కాపలాగా వున్నాయి.

చలికి ముడుచుకు పడుకున్నట్లుగా రెండు చోట్ల రోడ్డు పక్కగా లారీలు ఓ జీపు తల్లక్రిందులుగా పడివున్నాయి. ఆ హైవేమీద అది మామూలే!

"నువ్వెప్పుడూ నీ ఊరేదో నాకు చెప్పనేలేదు!" అన్నాడు శ్రీరామచంద్రమూర్తి సత్యాన్ని చూస్తూ.

"ఇంట్లోనుంచి వెళ్ళగొట్టబడినవాడికి ఊరేవిటి? ఇల్లేవిటి?" అన్నాడు నవ్వి సత్యం.

"నువ్వు నీ కులం సంకెళ్లు తెంచుకొని బయటకు వెళ్ళినా... నువ్వు చేసుకున్న సావిత్రికి నేను నూటికి నూరు మార్కులు వేస్తాను!"

"థాంక్యూ... వ్రతం చెడ్డా ఫలితం దక్కటం అంటే అదే!"

జీవితం బహు విచిత్రమైనది. అనుకున్నవి అనుకున్నట్లు జరిగితే దాని గొప్పే మున్నది?... డిగ్రీ అయింతరువాత సత్యం ఉద్యోగం సద్యోగంలేక అడ్డగాడిదలా తిరుగుతుంటే మిత్రులు టైపైనా నేర్చుకోమని సలహా ఇచ్చారు. అందుకోసమని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో చేరితే సావిత్రి పరిచయమవ్వటం- ఆపైన ఉద్యోగం దొరక్కముందే తన మెడకు ఆమె డోలయి కూర్చోవటంకూడా జరిగిపోయింది... అటూ యిటూ ఇళ్ళల్లో నానా రభస. ఇంట్లోనుంచి రోడ్డు మీదకు నడవరా బాబు అని పెద్దలు వాకిలి వంక చూపించిన రోజునే ఒంగోల్లో ఇప్పుడు చేస్తున్న ఉద్యోగం రావటం... సావిత్రిని తీసుకొని... నలుగురు మిత్రుల దగ్గరా నాలుగు డబ్బులు అప్పు పుచ్చుకొని ఒంగోల్లో దిగి ఉద్యోగంలో జేరడం- అదే ఆఫీసులో పనిచేస్తున్న శ్రీరామచంద్రమూర్తితో పరిచయం... ఖాళీగా వున్న వాళ్ళ పక్క పోర్షన్‌లోనే దిగిపోవటం...

గతంలోనుంచి బయటకు లాగుతున్నట్లుగా శ్రీరామచంద్రమూర్తి "కాఫీ త్రాగుదామా గురూ!" అన్నాడు.

"నాకొద్దు... త్రాగితే నువ్వు త్రాగు!" అన్నాడు సత్యం.

పక్కకు తొంగిచూచాడు సత్యం ఏ ఊరన్నట్లుగా. చిలకలూరిపేట బస్టాండులో బస్సు ఆగివున్నది. బస్సులోనుంచి దిగేవాళ్ళు దిగుతున్నారు... ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు.

"అప్పుడే చిలకలూరిపేట వచ్చేశామా?" అన్నాడు బయటకు, లారీలతో నిండిన రోడ్డు వంకచూస్తూ సత్యం.

"మనం బస్సెక్కి గంటన్నరయింది!" అన్నాడు శ్రీరామచంద్రమూర్తి.

చిలకలూరిపేటకు వున్న ప్రత్యేకతే అది. ఏ రోడ్డూ ఎప్పుడూ ఖాళీగా వుండదు. లారీలు... జీపులు... రోడ్డుమీదే వాటి బాగోగుల పరిశీలన... ఆపైన రిపేర్లు...

ఇక వానొచ్చిందంటే ఆ రోడ్డు శోభ చెప్పనలవికాదు.

ఎదురుగ్గా న్యూస్ పేపర్‌స్టాల్ కనబడింది. ఢిల్లీ రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కిపోతున్నాయి. "కాలక్షేపానికి ఓ పేపరు కొనుక్కువస్తాను!" అంటూ దిగాడు సత్యం.

బస్టాండ్ అంతా పాసింజర్ల రణగణ ధ్వనితో నిండిపోయింది. బస్సులో కొచ్చే అడుక్కుండేవాళ్ళు... పాప్‌కారన్ ప్యాకెట్లు అమ్మే కుర్రవాళ్ళు... బిస్కెట్ల ప్యాకెట్లు... జనం... జనం... అరుపులు... కేకలు...

"జంధ్యాలు కావాలాండి!" క్రిందే నిలబడిన మనిషి అడిగాడు శ్రీరామచంద్రమూర్తిని.

బస్సులో కిటికీ పక్కగా కూర్చున్న శ్రీరామచంద్రమూర్తి మెడతిప్పి బయటకు చూచాడు.

"చేత్తో వడికినవండీ... శ్రేష్ఠమయినవి... తీసుకుంటారా?"

సన్నగా వున్నాడు. పొడుగ్గా వున్నాడు. చామన ఛాయలో వున్నాడు. బాగా కత్తిరించిన జుట్టు. చిన్న పిలక. పెరిగిన గడ్డం. నీరుకావి పంచె కట్టుకుని చొక్కాలేని శరీరం మీద ఓ మాసిన ఉత్తరీయాన్ని కప్పుకున్నాడు.

"మీకు మామూలుగా దొరికేవి మిషన్ దారాలతో తయారు చేసినవి... అవి వేసుకోవడంలో వేసుకున్నామనే తృప్తే తప్ప ఫలితం వుండదండీ!"

ఆయన చేతిలో కదురు వున్నది. అది గిర్రున తిరుగుతున్నది. దాని కొక్కానికి తగులుకొని పైకి వచ్చిన దారం మెలితిరుగుతూ బలపడుతున్నది. ఆయన చేతి వేళ్ళ కొసలు విభూతితో తెల్లగా వున్నాయి. శ్రీరామచంద్రమూర్తి ఆయనవంకే చూస్తున్నాడు.

"నా చేత్తో స్వయంగా వడికిన ఈ జంధ్యాన్ని ధరించి ముప్పూటలా సంధ్యావందనం చేయండి... పవిత్రమైన బ్రహ్మముడిని చేతిలో వుంచుకొని గాయత్రి చేయండి... వాటి ఫలితం చూడండి!"

"ఉద్యోగాలు చేసుకునే మాకు ముప్పూటలా సంధ్యావందనం చేసే వీలెక్కడ కలుగుతుంది పంతులుగారూ!" అన్నాడు శ్రీరామచంద్రమూర్తి.

"అది శాస్త్రం! వీలుకానప్పుడు ఉదయసంధ్య, సాయంసంధ్య చేయండి!"

"ఫలితం తగ్గదా మరి!"

ఆయనకు శ్రీరామచంద్రమూర్తి మాటల్లో శ్లేష వున్నట్లనిపించగా చిన్నగా నవ్వాడు.

"మీ యింటిపేరు?"

"పొత్తూరు."

"నియోగులు... కౌండిన్యస గోత్రీకులు... గుంటూరు దగ్గర పొత్తూరేనా మీది?"

"తెలియదు... నాలుగో ఏట మానాన్న పోగా గుంటూరులో స్థిరపడిపోయాం... మా అసలు ఊరు ఏదో మరి!" చిన్నగా అన్నాడు శ్రీరామచంద్రమూర్తి.

"ఈ కాలంలో చాలా మందికి సంధ్యావందనంలోని శక్తి తెలియదు మాస్టారూ! చేసి చూడండి మీరు..."

"కట్టెలు... బొగ్గులు... కిరసనాయిలు స్టౌలు... ఎలక్ట్రిసిటీ... గ్యాసుపొయ్యి... ప్రపంచమే మారిపోతున్నది పంతులుగారూ... ఇదంతా యంత్ర యుగం... లేచి నప్పటినుండీ పరుగులే... గతంలో లాగా నేను కట్టెల పొయ్యి మీదే ఎసరు పెడతాను... బొగ్గుల కుంపటి మీదే కూర వండుతాను- అంటే ఆఫీసులకు వెళ్ళే మేం రోజూ ఆఫీసర్ల చేతిలో ఆలస్యంగా వచ్చినందుకు చివాట్లు తినటం మామూలయి పోతుంది."

ఆయన మాట్లాడలేదు. చేతిలోని కుదురును ఒక్కసారి గిర్రున తిప్పాడు.

"త్రికాలములందు సంధ్యావందనం చేయువాడు సమస్త పాపములనుండి విముక్తుడవుతాడు... పునరావృత్తి రహిత శాశ్వత బ్రహ్మలోకం పొందుతాడు!" ఆయన కళ్ళు సగం మూసుకొని తన్మయంగా అన్నాడు.

"అది పాపాలు తక్కువ పుణ్యాలు ఎక్కువగా వున్న పూర్వకాలంలో... ఇప్పుడు పుణ్యాలు తగ్గి పాపాలే ఎక్కువయి పోయినయి... ద్వికాల సంధ్యలు, త్రికాల సంధ్యలు, గాయత్రీ జపాలు... వాటి వాటి శక్తిని కోల్పోయినయి... చెడుది పైచేయి అయినప్పుడు మంచి అణిగిపోవడం సహజమే గదా!"

"మనం అనుకుంటున్నాం- అంతే! మీకు ఉపనయనం అయి ఎన్ని సంవత్సరాలు అయింది?"

"చాలాకాలం క్రితం... ఇప్పుడు నేను మా అమ్మాయి పెళ్ళికి సంబంధాల వేటలో వున్నాను!"

"అలాగా! నా దగ్గరున్నది మీకు అంటగట్టి నాలుగు డబ్బులు చేసుకుపోవాలనేది నా అభిమతం కాదు... నా మాట మీద గౌరవముంచి ఓ ప్రయత్నం చేయండి... ఈ పవిత్రమైన జంధ్యాన్ని తీసుకొని అంత పవిత్రంగానూ ధరించండి... ఇందాక మీరన్నారే ఇంకా వీటికి శక్తి ఎక్కడ వున్నదండీ- అని... తరువాత ఆ ప్రశ్నకు సమాధానం మీకు మీరే తెలుసుకుందురుగాని!"

"చెప్పండి... ఏంచేయాలి?"

"దీన్ని కుంకుమతో అలంకరించండి...పదిసార్లు గాయత్రి చేయండి... మంత్రోచ్ఛారణ చేస్తూ మొదటిది, రెండోది, మూడోది... ధరించండి... ఆపైన జీర్ణయజ్ఞోపవీతాన్ని విసర్జించండి!"

"మా అమ్మాయి పెళ్ళయిపోతుందా?" త్వరత్వరగా అన్నాడు, ఆయన మాటల్ని తేలికబరుస్తున్నట్లుగా చిన్నగా నవ్వుతూ.

ఇతడి మాటలకు బాధపడ్డ ఛాయలు ఆయన ముఖంలో లీలగానైనా కనబడలేదు. ఆయన చిన్నగా నవ్వుతూ, "మన జీవితంలో జరిగే సంఘటనలన్నీ విధి విధానం... ఒకసారి పైవాడు వాటిని మన నుదుటన రాసిన తరువాత ఎవ్వరూ మార్చలేరు!" అన్నాడు.

"మరెందుకీ వ్యర్థప్రయాసలు... పూజలంటూ, పునస్కారాలు అంటూ..."

"ఆత్మస్థయిర్యం కోసం... గుండె దిటవు కోసం... రోజూ ఎదుర్కొనే ఆటుపోట్లకు మనస్సు ఛిద్రమవ్వకుండా వుండటం కోసం!" ఆయన మాటల్లోని దృఢత్వం శ్రీరామచంద్రమూర్తిని ఉక్కిరిబిక్కిరి చేసింది.

కోలుకుని, "అంటే మన మనస్సు మొద్దుబారి పోతుందన్నమాట!" అన్నాడు.

"ఉఁహూ... కాదు... మీ మనస్సు మరింత మెత్తబడుతుంది... మీ గుండె మరింత సున్నిత మువుతుంది... మృదువై, పలచనై ఎటు తిప్పితే అటు తిరుగుతుంది... ముదురు ఆకును మడతపెట్టి వేళ్ళతో నొక్కండి... శబ్దంచేస్తూ అది విరిగిపోతుంది... అదే లేత ఆకుతో చేయండి... ఏమీ కాదు... మీ వేళ్ళు దాని మీదనుండి తీయగానే అది మామూలు స్థితికి వచ్చేస్తుంది... అలాగే మీరు ఎంత క్లిష్టమయిన పరిస్థితి నయినా చాలా ప్రశాంతంగా ఎదుర్కో గలుగుతారు!" ఆయన హాయిగా నవ్వాడు. ఆయన ముఖం ఏదో తెలియని తేజస్సుతో మెరుస్తున్నట్లనిపించింది ఆ మాటలు చెబుతున్నప్పుడు.

డ్రైవర్ బస్సెక్కడంతో దిగిన జనమంతా హడావుడిగా బస్సెక్కుతున్నారు. సత్యమూ వచ్చి శ్రీరామచంద్రమూర్తి పక్కగా తన సీట్లో కూర్చున్నాడు.

"ఒక్కటి ఇవ్వమంటారా?" తన లోతుకు పోయిన కళ్ళతో శ్రీరామచంద్రమూర్తినే చూస్తూ అన్నాడు ఆయన.

"ఎంతన్నారు?"

"ఐదు రూపాయలండీ!"

"అబ్బో... చాలా చెబుతున్నారే... సర్లేండి... ఈసారి ఇటు వచ్చినప్పుడు తీసుకుంటాను!"

ఆయన చిరునవ్వు నవ్వాడు. "మీ యిష్టం... కడుపునిండా తిండి తిని రెండు రోజులయింది కాబట్టి మీకేవో కథలు చెప్పానని మాత్రం అనుకోవద్దు... ఎప్పుడైనా సరే మనస్ఫూర్తిగా కావాలనిపిస్తేనే కొనండి!"

సత్యంకు ఆయనమాటలు స్పష్టంగా వినబడినాయి. తలెత్తి క్రిందకు చూచాడు శ్రీరామచంద్రమూర్తి భుజం మీదగా ఏమిటా అమ్ముతున్నవి అన్నట్లుగా.

ఆయన చేతిలో గిరగిరా తిరుగుతున్న కదురు... అతడికి అర్థమయింది... అవి జంధ్యాలు!

కళ్ళు పైకెత్తి ఆయన ముఖంలోకి చూచాడు- సన్నగా పొడుగ్గా దివటలా కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకున్నట్లుగా వున్న ఆయన్ను చూస్తుంటే గుండె చిక్కబట్టినట్లయింది సత్యంకు. గుంటలు పడ్డ చెంపల మీదుగా అంత ఉదయాన గూడా తెల్లగా పెరిగిన గడ్డంలోనుంచి జారుతున్న స్వేద బిందువులు...

ఆపైన ఎన్ని రోజులగానో భోజనం చేయనట్లుగా వున్న ఆ కాంతిహీనమైన ముఖం... క్షణం అసహనంగా అటూ యిటూ కదిలాడు.

తను కొందామన్నా వాటితో తనకు అవసరంలేదు. సావిత్రి తనకు అర్ధాంగి అయిన మరుక్షణంలోనే దాన్ని తీసి తను అవతల పడేశాడు. అయినా నాలుగు సంవత్సరాల క్రితం వరకు తనను అంటిపెట్టుకొని వున్న జంధ్యాన్ని తనెలా మరువగలడు?

'పోనీయ్ శ్రీరామచంద్రమూర్తి అయినా ఒకటి తీసుకోగూడదూ' అనుకున్నాడు సత్యం- ఆయనమీద జాలితో నిండిన గుండె బరువెక్కగా.

"ఒక్కటి తీసుకోండి!" ఆయన చిన్నగా అంటున్నాడు. "అయిదు రూపాయలే గదా!... మీరు హోటల్‌కు వెళ్ళి రెండిడ్లీలు తిని కాఫీ త్రాగితే అంతకు అంత అవుతుంది!"

"వద్దండీ... నేను మొన్న పౌర్ణమినాడే మార్చాను... ఈసారి ఇటు వచ్చినప్పుడు తీసుకుంటానన్నాను గదా!"

ఆయన దృష్టి అప్పుడే గేటులోనుంచి లోపలకు వస్తున్న మరో బస్సు వైపుకు మళ్ళింది. అది ఎటుపక్కకు వెళ్ళి ఆగుతుందో అన్నట్లుగా చూస్తున్నాడు.

బస్టాండులో పదిగంటలదాకా తిరుగుతూ ఒకటో రెండో అమ్మగలిగితే ఉప్పు పప్పు తీసుకెళ్ళి ఇంట్లో పడేస్తాడు. ఆపైన ఎవరింట్లోనైనా పూజగానీ, ఆబ్దీకంగానీ వుంటే అక్కడకు వెళతాడు.

ఆయనది ఏరోజు సంపాదన ఆరోజే! ఆయన కొత్తగా వస్తున్న బస్సు వైపు అడుగులు వేస్తున్నాడు. బలహీనమైన కాళ్ళు తడబడుతున్నట్లుగా- తూలుతున్నాడేమో అనిపించింది. మనస్సంతా వేడికి కరుగుతున్న మైనపు ముద్దలా అవ్వగా శరీరమంతా జాలితో తడిసిపోతున్నది సత్యానికి.

"శ్రీరామచంద్రమూర్తీ! ఆయన దగ్గర ఎన్ని జంధ్యాలున్నయ్యో అడుగు!" అన్నాడు ప్యాంటు జేబులోనుంచి పర్సు బయటకు తీస్తూ సత్యం.

"నువ్వేం చేస్తావ్ వాటిని?" ఎగతాళిగా అన్నాడు.

"మీలాంటి ఆప్తమిత్రులకిస్తాను!" క్షణం గూడా ఆలస్యం చేయలేదు సత్యం.

డ్రైవరు ఇంజన్ స్టార్టు చేశాడు.

ముందుసీట్లలో కూర్చున్న ఓ ప్రయాణీకురాలు, ఏడుస్తున్న పసిపిల్లను గుండెలకు హత్తుకుంటూ, "ఒక్క నిముషమండీ... ఆయన పిల్లకు పాలకోసం వెళ్ళారు!" అన్నది.

బస్సు ఎక్కబోతున్న కండక్టరు విసుగ్గా ఆమె ముఖంలోకి చూచాడు- అప్పటికే ఎంతో ఆలస్యం అయిపోయిం దన్నట్లుగా.

శ్రీరామచంద్రమూర్తి, "పంతులుగారూ!" అని పిలిచాడు.

ఆయన ఆశగా మొహాన్ని ఇటుగా తిప్పి వెనక్కు అడుగులు వేశాడు.

"మీ దగ్గర ఎన్ని వున్నాయండీ?"

ఆయన ముఖంలో ఎలాంటి మార్పు లేదు. "పదిదాకా వున్నయ్యండి!"

"ఇటివ్వండి. మా స్నేహితుడికి కావాలిట!" అన్నాడు సత్యం ఇచ్చిన యాభై రూపాయల నోటును బస్సు కిటికీ లోనుండి బయటకు జాపిన చేత్తో ఆయనకు చూపిస్తూ.

ఆయన తృప్తిగా తలెత్తాడు.

చేతిలో గిర్రున తిరుగుతున్న కుదురును ఆపాడు. చేసంచీలోనుంచి జంధ్యాల నన్నింటినీ బయటకు తీశాడు.

మునివేళ్ళ మీద ఒక్కసారి పైకి లేచాడు- తన దగ్గరవున్న అన్ని జంధ్యాలనూ కొనబోతున్న ఆ వ్యక్తిని చూడాలీ అన్నట్లుగా.

ఒక్క క్షణం- లోపల వైపుకు వున్న సత్యం మొహంలోకి చూడగానే ఆయన కళ్ళు తళుక్కున మెరిసినయి. మరు క్షణంలోనే చేతిలోకి తీసుకున్న జంధ్యాలనన్నిటినీ ఆ సంచీలోకి జారవిడిచాడు.

"వద్దులేండి... వీటిని అపవిత్రం చేయడం నాకిష్టం లేదు!" అంటూనే వడివడిగా నడుచుకుంటూ జనంలో కలిసి పోయాడు.

శ్రీరామచంద్రమూర్తి విచిత్రంగా ఆయన వెళ్ళిపోతున్న వైపుకే చూస్తున్నాడు.

"అదేఁవిటి సత్యం! ఆయన ఇవ్వకుండానే వెళ్ళిపోతున్నాడేమిటి?" అన్నాడు వింతగా ఇంకా అటే చూస్తూ.

కండక్టర్ పాలసీసాతో ఎక్కిన ప్యాసింజర్ వెనగ్గా ఎక్కుతూ- డోరు మూసి "రైట్" అన్నాడు.

సత్యమూ అయోమయంగా అటే చూస్తున్నాడు.

తరువాత కొద్ది క్షణాలకు అతడి పెదిమల మీద చిరునవ్వు వెలిగింది. శ్రీరామచంద్రమూర్తి కళ్ళల్లోకే చూస్తూ, "అది ఆయన ఆత్మస్థయిర్యం... గుండె దిటవు... తన సిద్ధాంతాలమీద తన నమ్మకం!" అన్నాడు గర్వంగా సత్యం.

"నీకు తెలుసా ఆయన?"

"ఆయన మా నాన్న!"

* * *

*(కథామహల్, 1999)*